
శ్రీమాత్రే నమః

అమ్మ తత్త్వము



విజ్ఞాన స్వరూప్

శ్రీ మాత్రేనమ

అమ్మతత్త్వం



యా దేవీ సర్వ భూతేషు
మాతృరూపేణ సంస్థిత ః

విజ్ఞానస్వరూప్

ప్రచురణ :
శ్రీ విశ్వజననీ పరిషత్, జిల్లెళ్ళమూడి.

శ్రీ మాత్రేనమ :

అమ్మతత్త్వం

యా దేవీ సర్వ భూతేషు మాతృరూపేణ సంస్థిత :

అమ్మ తత్త్వాన్ని అమ్మనే అనేక సందర్భాలలో అడిగి తెలుసుకొనే ప్రయత్నం కొందరు చేశారు. వారికి ప్రత్యక్షంగానో మర్మంగానో చెప్పిన మాటలు అమ్మ వాక్యాలుగా ముద్రించ బడినవి. అమ్మవాక్యాలను ఎందుకు తీసుకున్నామంటే **అమ్మమాటలు అమ్మ భావాలే** అని అమ్మ అన్నారు గనుక.అమ్మ దయ చూపినట్టివి, తన కార్యక్రమము జరిపే సంబంధమైనవి, అనేక భక్తులను సంబోధించిన వాక్యాలు కూడా ఉన్నవి. అమ్మ సర్వజ్ఞత్వము నిరూపించే మాటలూ ఉన్నాయి. వీటన్నిటి నుండి అమ్మను తెలుసుకొనే వాక్యాలను ఎంపికచేసి విశ్లేషించే ప్రయత్నం చేసి, వేదాంతానికి సమన్వయ పరచే ప్రయత్నం కూడా ఇప్పటికే కొందరు ప్రముఖులు చేశారు. మరొక ప్రయత్నం నాచేత చేయబడాలని 2011 నవంబరు : 18,19,20 తేదీలలో జరిగే అమ్మ తత్త్వ మహాసదస్సుకు అమ్మ పిలుపు అందింది. తత్త్వనిర్ణయం చేసేందుకు తగిన ప్రేరణ కూడా అమ్మే ఇచ్చింది. అందుకే ఈ చిరు ప్రయత్నం మరలా.

అమ్మ మాట, ప్రవర్తన, స్వభావము అన్నీ తెరచిన పుస్తకంలా ఉన్నాయి .కనుక 1) అమ్మ యదార్థస్థితిని 2) అవతార స్థితిని , 3) అమ్మ కార్యక్రమ సరళిని మరియు 4) అమ్మ జనావళి మొత్తానికి ఏమి చేయాలని సంకల్పించారోనని నాలుగు భాగములుగా విభజించి చూస్తే గాని అమ్మతత్త్వం బోధపడదు.

నాకు యేది చెప్పినా సరిపోతుంది, ఎందుకంటే ఉన్నదొక్కటే గనుక అనే అమ్మ వాక్యానికి పెద్ద గ్రంథమే వ్రాయవచ్చును. కాని అమ్మను ఈ నాలుగు విధములుగా వర్ణించ బూనుకొంటే అమ్మకు విశేషంగా శ్రీ లలితా సహస్ర నామాలు సరిపోయేటట్లు అతుకుతాయి. అన్ని నామాలను

అమ్మకు సరిపెట్టే ప్రయత్నం చేయకుండా అమ్మతత్త్వాన్ని అమ్మ వాక్యాలలోనే వివరిస్తూ అచ్చటచ్చట లలితా నామాలను సమన్వయమైన వాటిని మాత్రమే ఉదహరిస్తూ పోతూ, ఈ ప్రసంగ పాఠాన్ని సహజంగా ఉండే విధంగా తయారుచేయ సంకల్పించడమైనది. సాధ్యమయినంత క్లుప్తంగానూ, సూటిగానూ చెప్పే ప్రయత్నం జరిగింది.

అమ్మ వాక్యాల సమాహారంగా అమ్మ తత్త్వాన్ని తెలుసుకొనే ప్రతయత్నం చేద్దాం.

అసంగుడైన బ్రహ్మమం దనాది మాయ లేనిదై
ముసుంగు కప్పినట్లు నిండి మూలకారణాంశమై
పొసంగి విశ్వమందు జేరి భూత భౌతికాదులై
మసంగి చచ్చి పుట్టుచుండు మారులేక నంతటన్

యదార్థమే నాస్థితి అన్న అమ్మ వాక్యంతో తాను అసంగుడైన బ్రహ్మమని నిర్ణయమైంది. **నేను వల్లగాని మిట్ట ప్రదేశం** అన్నప్పుడుకూడా ఆ నిర్వికార అనిర్వచనీయ బ్రహ్మమేనని అర్థమైంది. ఇట్టి బ్రహ్మము తనకు తాను స్వతస్సిద్ధమైయుండగా అనాది మాయ లేనిదే యై కూడా సృష్టికి మూలమై, కలిగిన సృష్టియందు అంశీభూతమై మూలప్రకృతి రూపంలో, లేక మూలావిద్య రూపంలో ఉన్నది. సత్యము అనే పురుషుడిని చేరి ఆ పురుషుణ్ణి స్పందింపచేసి సగుణునిగా మార్చి సృష్టిచేయ ను పక్రమించింది ఈ మూలావిద్యయే. **రూపం పురుషుడు , లోని శక్తి ప్రకృతి, ఒకదాన్ని విడిచి మరొకటి లేదు** అన్నారు అమ్మ . కనుక ఈ బ్రహ్మ అవిద్యాశబలిత బ్రహ్మ.

ఆది యందు వాక్యముండెను. వాక్యము దేవుని యొద్ద ఉండెను. వాక్యము దేవుడయ్యెను. ఆ యనవలన సమస్తము కలిగెను. కలిగినదేదియు ఆయన లేకుండాలేదు. అనే యోహాను సువార్త వాక్యానుసారము ఆది యందున్న వాక్యము అనాది మాయ లేక మూలావిద్య లేక అవిద్యాశబలితబ్రహ్మము. వాక్యము దేవుని యొద్ద ఉండెను. అన్నప్పుడు

ఆదేవుడు అసంగుడైన బ్రహ్మము. అదే సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ. అదే అమ్మ యదార్ధస్థితి. **మెదలకుండా ఉండటం మాత్రేకదా!** అన్న అమ్మ వాక్యం చూపించేది నిర్వికార అచల బ్రహ్మస్థితి లేక యదార్ధస్థితి.

ఇక రెండవ స్థితి అవిద్యాశబలమైనస్థితి. ప్రేరణశక్తి, లేక మూలప్రకృతి అమ్మనామమే. ప్రకృతి పురుషుల అర్ధనారీశ్వర స్థితి కూడా అమ్మ నామమే. **అర్థనారీశ్వర తత్త్వం అంటే ఒకదానిలో ఒకటి ఇమిడి ఉండటమే.** బీజమూ బీజశక్తీ లాగా. ఒకే నాణానికి బొమ్మ బొరుసు లాగా. **అమ్మలో నుండి ప్రకోపింపబడ్డవాడే నాన్న, ప్రకోపింప చేస్తుంది గాని ప్రపించదు అమ్మ** అని తన మూలా విద్యాస్థితిని తనచే కదిలించ బడ్డ పురుషుణ్ణి మరియు ప్రకృతి పురుషుల అభేదస్థితిని కూడా అమ్మతత్త్వంగా బయట పెట్టింది అమ్మ. **నేను ఈ ప్రకృతే పురుషుడంటాను** అని తన అర్థనారీశ్వర తత్త్వాన్ని నిర్ణయం చేశారు అమ్మ. **మాయంటే వేరే ఉంది అనటంలేదు, మాయ కూడా భగంతుడే, నేను జగత్తే దైవమంటాను** అని చెప్పటం ద్వారా తానే సర్వమై ఆ సర్వమందు అభేదంగా అంశీభూతిమై యున్నదనియు, తాను లేకుండా ఏదీ లేదనియూ చెప్పారు అమ్మ, **మారేది మారని దాంట్లోంచి వచ్చింది** అంటూ నిర్వికార అద్వయ బ్రహ్మనుండి మార్పుచెందే. భూతభౌతికాదులు వచ్చి మార్పు చెందుచూ చచ్చి తిరిగి పుట్టుచూ, చక్రభ్రమణముగా తిరుగుచూ అంతులేకుండా ఉన్నదనీ, ఇదంతయూ మూలప్రకృతి ప్రభావమేనని అమ్మ ఉద్దేశ్యము. **అన్నిటికీ నేనే మూలం** అని అమ్మ అన్నది. అందువలన అమ్మతత్త్వం మూలప్రకృతి. **అంతా అదే** అంటే సర్వం ఖల్విదం బ్రహ్మ. ఇదే మాయ యొక్క మూలకారణాంశము. నీవెవరివి ? అంటే **అమ్మను** అని సమాధానమిచ్చిన అమ్మయే శ్రీమాతా. ఎవరికీ అంటే **నీకు, మీకు, అందరికి. పశుపక్ష్యాదులకు, క్రిమికీటకాలకూ** అని అమ్మ ఆబ్రహ్మ కీటక జననీగా విశ్వజననీగా, తన తత్త్వాన్ని బయట పెట్టారు. మంచమ్మవు అని భక్తులంటే **ఆ ? మంచమ్మనా ? మంచి అంటే మాయ** అని అమ్మతనను మాయాశక్తిగా ప్రకటించుకున్నారు. **అమ్మంటే యేం ? బ్రహ్మంటేయేం ?** అని తన

యొక్క సగుణ బ్రహ్మ లేక అవిద్యాశ బలిత బ్రహ్మ స్థితిని తెలిపారు. కనుక అమ్మను మహామాయగా, మూలప్రకృతిగా. మాయాశక్తిగా, మహాశక్తిగా, సర్వశక్తి మయిగా కీర్తించవచ్చును. **శక్తి అంటే అన్నిటికీ మూలమైనది. శక్తి కనపడదు. శక్తి శరీరం అంతటా నిండి ఉన్నది, విశ్వమంతా కూడా నిండి ఉన్నది. ఆ శక్తికి ఇదంతా ఇట్లా అయిపోవటం సహజం.** ఆ శక్తియే మూల కారణమై మూలకారణాంశమై అంతా అదేగా నిండి ఉన్నది. జగత్కారణం, జగత్తూ రెండూ ఆ మాయాశక్తియే.

మాయంటే వేరే ఉంది అనటంలేదు. మాయ కూడా భగవంతుడే, నేను జగత్తే దైవమంటాను అని అమ్మ తన మాయా శక్తి స్వరూపాన్ని మర్మంగా తెలియ చేశారు. మాయగురించి **సర్వమూ తానైనదే ఉన్నది** అని అమ్మతత్త్వం తెలియపరుస్తూ **ఆడేది, ఆడించేది, చూచేది** అదే నని అమ్మగురించి అమ్మే చెప్పినట్లు అయింది. అంతా అమ్మే జరిపిస్తున్నప్పుడు మధ్యలో మనం చేసేదేముంది. ?

ఏదీ నువ్వు చేయలేనప్పుడు, ఏదోశక్తి నిన్ను నడుపుతున్నప్పుడు ఇంకా పాప పుణ్యాలగురించీ, జన్మలగురించీ ఆలోచన ఎందుకు ? అని మానవుల బలహీనతను తనపైనే వేసుకున్నారు అమ్మ. **సమష్టి కర్మ తప్ప వ్యష్టి కర్మలేదు** అని **సర్వ సంకల్పములు, సర్వ వాక్కులు, సర్వ కర్మలు దానివే** అని, అనగా ఆ మూలశక్తివేనని తేల్చి చెప్పారు అమ్మ.

శాస్త్రాలు కూడా అమ్మనుండే ఆవిర్భవించాయి. కనుక అమ్మ శాస్త్రాలు చదివి తెలుసుకోనవసరం లేదు. అమ్మస్వానుభవమే శాస్త్రము. నిజానికి శాస్త్రాని కన్నా అమ్మ అనుభవమే ప్రమాణం. అందుకే **నాకు శాస్త్ర పరిచయం లేదు నాన్నా, నేను ఏది చెప్పినా అనుభంలోదే చెపుతాను** అని అమ్మచెప్పారు మరియు **అనుభవం శాస్త్రాన్నిస్తుంది, కాని శాస్త్రం అనుభవాన్నివ్వదు** అని కూడా అన్నారు.

అమ్మంటే అంతులేనిది అనగా నిర్నాశా. **అడ్డులేనిది** అనగా నిరత్యయ. **ఆధారమైనది** అనగా సర్వాధారా. **నాకు నేనే ఉపమానం**

అనగా నిరుపమ, అప్రమేయా మరియు అమ్మకు అమ్మేసాటి గాని, పోల్చడానికి మరొకటి లేదు. అమ్మ అమేయాత్మా. **నేను నేనైన నేను** అనే అమ్మ ఒకరిలో అసత్యనేనుగా కాక మరియు మనస్సే నేనుగా కాక ఆత్మే యదార్ధనేనుగా నున్న చైతన్యం. ఈ చైతన్యమే అందరిలోనూ నేనుగా తోస్తున్నది. కనక అమ్మ అన్ని నేనులూ నేను నేనైన నేను అని అందరిలో తానే అఖండాత్మగా నున్నట్లు తెలియజేస్తున్నారు. అందువలన అమ్మ విరాడ్రూపిణి. అమ్మ అణోరణీయాన్. అమ్మ మహతోమహీయాన్. అమ్మ విశ్వరూపిణి మరియు విశ్వమాతా.

అమ్మలో నుండి ప్రకోపింపబడ్డవాడే నాన్న. అమ్మ ప్రకృతియైతే నాన్న పురుషుడు. అమ్మశక్తియైతే, నాన్న శివుడు. **నేను ప్రకృతే పరమేశ్వరుడంటాను** అని అమ్మ శివశక్త్యైక్యరూపిణీ అయింది. **రూపం పురుషుడు, లోని శక్తి ప్రకృతి, ఒకదాన్ని విడిచి మరొకటిలేదు** అన్న వాక్యంలో బీజం రూపం,బీజ శక్తి ప్రకృతి, బీజాన్ని ఆశ్రయించి బీజశక్తి ఉంటుంది గాని, బీజశక్తి విడిగా ఏ పనీ చేయలేదు. అలాగే బీజశక్తిలేని బీజము అంకురించదు.ఫలపుష్పాదులనివ్వదు. ఆధార ఆధేయంగా ఒక్కటిగానే ఉంటుంది. ఈ సృష్టికూడా ప్రకృతి పురుషులిద్దరి వల్లా కలుగుతుందిగాని, ఏ ఒక్కరి వల్లా కాదు.

శ్లో ॥ బీజశ్యాంత రివాంకురో జగదిదం ప్రాంజ్ నిర్వికల్పం పునః
మాయా కల్పిత దేశకాలకలనా వైచిత్ర్య చిత్రీకృతం
మాయా వీవ విజృంభయత్యపి -. దక్షిణామూర్తి స్తోత్రం

అమ్మ సగుణ బ్రహ్మమై ఆవరణను కల్పించి అందు దేశము, కాలము, పదార్ధము, చలనములను తోచేటట్లు చేసింది. ఇవన్నీ కూడా ఇంద్రజాలము వలే లేకనే ఉన్నట్లు తోచడమే గాక, చిత్ర విచిత్రములుగా చిత్రీకరించబడ్డాయి. భ్రమపుట్టించింది అమ్మ. ఇది ఒక క్రమ పద్ధతిలో ఒకదాని నుండి మరొకటి వచ్చి పంచీకరణమై అఖిల జగత్తుగా ఏర్పడింది.

శ్లో ॥ పచ్చబ్దవాచ్యం అవిద్యాశబలం, బ్రహ్మణో అవ్యక్త :
అవ్యక్తో మహతు మహతో మహదహంకార :

అహంకారో పంచతన్మాత్రాణి పంచతన్మాత్రేభ్యో
పంచభూతాని పంచభూతేభ్యో అఖిలం జగత్

సత్యము అసంగుడైన బ్రహ్మగా ఉండగా సత్యమనే పేరుతో అవిద్యాశబలిత బ్రహ్మ లేకనే ఉన్నట్లు తోచి ఆ బ్రహ్మమే మొదట అవ్యక్తమై తరువాత వ్యక్త స్వరూపాలైంది. కనుక అమ్మ వ్యక్తావ్యక్త రూపిణి. అవ్యక్తరూపం మార్పు చెందనిది. వ్యక్తరూపాలన్నీ మార్పుచెందేవి. అందుకే అమ్మ అంటారు **మారేది మారని దాంట్లోంచి వచ్చింది** అని.

ఏ మాయా శక్తివల్ల ఈ జగత్తు తోచిందో ఆ మాయాశక్తి తల్లివంటిది. కలిగినదేదియు ఆ తల్లిలేకుండా లేదు గనుక, అమ్మ జగన్మాత మరియు జగుత్తు కూడా. ఎందుకంటే జగత్సృష్టికి బ్రహ్మమే పదార్థంగాని బ్రహ్మకంటే వేరైన పదార్థంలేదు. ఏకమేవా అద్వితీయం బ్రహ్మకనుక పంచదారతో చేసిన చిలుకలు. నెమళ్ళు, కుందేళ్ళూ, అన్నీకూడా పంచదార తత్త్వంగా ఒక్కటే అయినట్లు. అమ్మ అంటారు.

జగన్మాత అంటే జగత్తుకు తల్లికాదు. జగత్తేతల్లి అని, జగత్తూ జగదీశ్వరుడూ వేరుకాదు అని జగత్తు ఆత్మకంటే భిన్నంకాదు అని, సృష్టికంటే మించిన దైవం ఎక్కడుంది.? సృష్టియే దైవం అని. ఈ విధంగా అమ్మ వాక్యాలే శాస్త్రంగాని అమ్మశాస్త్రాలను ఆధారం చేసుకొని చెప్పటంలేదు. అమ్మ ఏ సందర్భంలో తనకు ఎలాతోస్తే అలా చెప్పారు. అదే శాస్త్రంతో సరిపెట్టుకోవడం మనవంతు. సరిపోతుంది కూడా.

సృష్టి అంటే నామరూపాలుకదా? దైవం ఎలా అవుతుంది? సృష్టిలో ఏ వస్తువయినా ఉండటం అనగా అస్తిత్వం, తెలియబడటం అనగా భాసించడం జరుగుతుంది. తెలియబడ్డాక ఆ వస్తువు మీద ఆసక్తి కలుగుతుంది. అదే ప్రియం. కాని ఆ వస్తువుకు ఒక రూపం, గుణం, ఉంటాయి. దాన్ని బట్టి దానికి పేరు పెడతాం. కనుక సృష్టి అంతా అస్తి, భాతి, ప్రియం, నామం, రూపం కలిగి ఉంటాయి. నామ రూపాలు తోస్తే భేద భావం ఉన్నట్లు. నామరూపాలు తోచకకపోతే అన్నీ ఒక్క తీరుగానే తెలియబడతాయి. వస్తు భేదంపోతే అస్తి, భాతి, ప్రియాలే సత్ చిత్

ఆనందాలుగా అనుభవంలోకి వస్తాయి. అలాంటప్పుడు సృష్టియే దైవంగా గోచరిస్తుంది. నామ రూపాలు తోస్తే అస్తి భాతి ప్రియం గోచరించదు. అప్పుడది బంధమవుతుంది. అందుకే అమ్మ అంటారు - **రూపంలోనే తేడా, అంతా దైవమే** అని .నామరూపాలు తోచడంలో కర్మానుభవము మరియు మన మనస్సుకు ఎక్కడి నుండో ప్రేరణ అందుతూ ఉంటుంది. దానివలన రాగద్వేషాలు కలుగుతాయి. రాగద్వేషాలు లేకుంటే అంతా దైవమే. అమ్మ అనుసూయ తత్త్వంతో అవతరించి రాగద్వేషాలను పారద్రోలాలని సంకల్పించారు. **రాగ ద్వేష అసూయలను పారద్రోలేదే అనసూయ తత్త్వం** అని అమ్మవాక్యం. భిన్నత్వం తోస్తే రాగద్వేషాలు కలుగుతాయి. భిన్నత్వం లేకపోతే చూడబడేదంతా దైవమే. **భిన్నత్వలేని మనస్తత్వమే దైవత్వం** అన్నారు అమ్మ.

ఇష్టాయిష్టాలు, మంచీ చెడు అనే ద్వంద్వాలు లేకుండా ప్రతివస్తువును ప్రతి సంఘటననూ ఉన్నదున్నట్లు, జరిగింది జరిగినట్లు అంగీకరించడమే దైవత్వం. అన్నిటికీ సరే,సరే నంటూ అంగీకరిస్తూపోవాలి. కాదు, వద్దు, యిష్టం లేదు, అనే మాటలుండకూడదు. దీనికి అమ్మ ఏమంటారు.? **అది ఎట్లా నడిపిస్తే అట్లానడుస్తున్నాం. ఏది చేసినా ఆ శక్తే చేయిస్తుంది. చేయాలనుకున్నా చేయలేకపోవటానికి, మానుకోవాలన్నా మానుకోలేకపోవటానికి కారణం మన చేతుల్లోనిది కాదు. వీటికి అతీతమైన శక్తి అన్నీ చేయిస్తుంది. మీరు దేనికీ కర్తలు కారు. కర్తృత్వం ఎవరిదీ ? శక్తిదే. ఆ శక్తి కర్తృత్వం క్రింద ఆడబడే వాళ్ళమే మనము. ఒక విధమైన బొమ్మలమే. అందరూ , అన్నీఅంతా అయిన శక్తి నడిపిస్తే నడిచేవే.**మధ్యలో మనం కర్త భోక్త అనడం మన అజ్ఞానం దాని వలన రాగ ద్వేషాలు, వీటి వలన బంధం ఏర్పడుతున్నది. **తానొకటి తలిస్తే దైవమొకటి తలుస్తాడు కాదు, దైవం తలిస్తేనే తాను తలుస్తాడు. ఆడేదీ, ఆడించేదీ,చూచేదీ "అదే"** అనడం తప్ప మరేమిచేయగలం ? అన్నిటినీ సరే ననడమే అమ్మ యిచ్చిన **సరే మంత్రం** . రాగ ద్వేషాల గురించి అమ్మ ఇలా చెప్పారు. **తన కోసం చేసేది రాగం, ఇంతరులకోసం చేసేది**

త్యాగం. త్యాగమే రాగాన్ని జయించడానికి మంత్రం, **_బిడ్డలయందు ప్రేమ ఉంటే అది పామరత్వం, అందరియందు ఉంటే మాధవత్వం** అని అమ్మమాట .

ఈ ప్రపంచము, ఈ సంసారము మనకు ఒక ప్రయోగశాలగా ఉపయోగ పడతాయి. నామరూపాలకు బదులు సత్ చిత్ ఆనంద స్వరూపం చూచే అభ్యాసం కోసం ఉపయోగపడతాయి. రాగద్వేషాలు జయించి, త్యాగం చేయడానికి పనికొస్తాయి. సృష్టినే దైవంగా చూడగలిగితే జగత్తు కూడా సత్యమే. **జగత్సత్యం బ్రహ్మ మిథ్య అంటే లేదని కాదు, పరిణామం అని అమ్మ భాష్యం. ఇన్ని బ్రహ్మలు లేవు, మారుతూ ఉన్న బ్రహ్మ ఒక్కటే** . మారనిది బ్రహ్మకు పరమైనది. అది పరబ్రహ్మతత్త్వం.

జగత్తు మిథ్య అన్నప్పుడు జగత్తు కల్పితం అనే అర్థంలో చూస్తే, మనమంతా కూడా కల్పితము, లేక లేనివారము అయినప్పుడు అమ్మ మనకోసం అవతరించవలసిన అగత్యంలేదు కాదా ! అమ్మ అవతరించి మనందరికీ సుగతి కలిగిస్తున్నప్పుడు అమ్మ **జగత్తు సత్యము** అనక మరేమంటారు ? చిత్తు. జడము రెండూ సత్యమే. సర్వం బ్రహ్మమయం. సాధన కోసం మనలో తోచిన నేనుకు అహం బ్రహ్మయని అనుభవం రావటానికి నామ రూప జగత్తును కాదని, అందు వ్యాపించియున్న చైతన్యాన్ని సత్యమని చెప్పవలసి వచ్చింది. జడానికి బ్రహ్మానుభవం రావడం కుదరదు గనుక అనాత్మను ఇది కాదిదికాదని అన్నారు.

నిజానికి అంతా భగవంతుడే, అంతా సత్యమే. అనుభవానికి వచ్చే సత్యం కోసం ప్రజ్ఞానంబ్రహ్మ అని విషయాలనుండి వేరుచేస్తున్నామకాని, అజ్ఞానమూ బ్రహ్మమే. **ప్రజ్ఞానం బ్రహ్మంటే, అజ్ఞానం ఎందుక్కాదు.?** అని అమ్మ ప్రశ్నించారు. **అన్నం పరబ్రహ్మ అంటే అశుద్ధమో ?** అని పశ్నించారు అమ్మ.

ప్రతీతమైన బాహ్యప్రపంచం బాధిస్తున్నప్పుడు మూలమైన శక్తి లేక చైతన్యం గుర్తింపబడి. స్వానుభంలోకి రావాలి. ఇది తెలియజేయడానికే

అమ్మ వాక్యాలు మరియు అమ్మ అవతారం. **తెలియంది తెలియజేయడానికే నా యీ రాక** అని అమ్మ తన అవతార కార్యక్రమం ప్రకటించారు. **అంతా ఉన్న అమ్మను (బ్రహ్మను) తెలియజేయడానికే ఈ అమ్మ** అని అంతటా ఉన్న బ్రహ్మను తెలిసికొనే జ్ఞానాన్ని ప్రేమ తత్త్వం ద్వారా అందిచడమే అమ్మలక్ష్యం. **తల్లి రక్షణ కాదు, రక్షణే తల్లి** అని ఆమె మాతృత్వం గురించి చెప్తూ అమ్మ రక్షాకరీ అయింది. తన అవతారం గురించి అమ్మనడిగితే **అమ్మగా చెప్పేదేముంది.? అమ్మగా వ్యక్తం కావడమే** నని తెలియజేశారు అమ్మ.

సత్యమైన నిర్గుణస్థితి అమ్మ యొక్క యదార్థస్థితి గనుక, ఆస్థితిని **అమ్మ** మరుగు చేసికొని **అమ్మ** అనే శరీరం ధరించారు. అవతారంలో రక్షకురాలు, కనుక రక్షణ కావలసిన భక్తులు మాత్రం అమ్మ వద్దకు, ఆమె **అమ్మే**నని వస్తారు గాని, అమ్మ సత్యస్వరూపమని రారు. అందుకే అమ్మ అంటారు **నాయందు సత్యం లేదు, సత్యమనే వస్తున్నారని అనుకోవద్దు "అమ్మ" అని వస్తున్నారు** అని. అయినప్పటికి అమ్మకు మరుగూ, మరుపూకీ లేవు. **నాకు మరుగూ లేదు మరుపూ లేదు** అన్నారు అమ్మ. మరుగంటే బ్రాంతి జనించడం, మరుపంటే తన నిజస్థితిని మరచిన అజ్ఞానం. ఈ రెండూ అమ్మకులేవు. ఒకరు అమ్మా! నీ ముసుగు తొలగిందమ్మా అని అన్నారు.అప్పుడు అమ్మ అన్నారు, మీరంతా **ముసుగులో ఉండి, ఇంకా ముసుగు కావాలంటారేమిటి ?** అని తన నిరావరణ స్థితిని తెలియజేస్తూ, మన అజ్ఞానావరణ గురించి హెచ్చరిస్తున్నారు అమ్మ. కనుక అమ్మ దాల్చినది మాతృశ్రీ అవతారము.బిడ్డల్ని కనగానే మాతృత్వం వస్తుంది ఏ స్త్రీ కైనా. కాని బిడ్డను ప్రేమగా చూసుకొనే తత్త్వం ఉండక పోవచ్చును. **అమ్మ అంటే ఆడదీ. కనటమనీ కాదు. మాతృత్వం ఎక్కడుందో అక్కడ అమ్మ ఉంది** అని అమ్మావతారం యొక్క నిర్వచనం. అమ్మ అంటారు, **మాతృత్వం వేరు మాతృతత్త్వంవేరు** అని. అమ్మయొక్క అవతార తత్త్వం మాతృతత్త్వం. అందువలన అమ్మ ప్రేమ స్వరూపిణి.

మాతృశ్రీ అవతారమే ఎందుకు ధరించాలి ? అంటే రాగద్వేషాలతో,

సతమతమయ్యే జనులకు నిస్వార్థ ప్రేమను నేర్పడానికి. అమ్మను మనం ప్రేమించినా ప్రేమించకపోయినా అమ్మ మాత్రం మనలను ప్రేమిస్తూనే ఉంటుంది. అదే అమ్మతత్త్వం. ప్రేమించడం నేర్పడానికి తల్లిగానే అవతరించాలా ? దేశ భక్తుడు తన దేశాన్ని మాత్రమే ప్రేమిస్తాడు. తన శత్రుదేశాన్ని ద్వేషిస్తాడు. ఈ ప్రేమ సహజమైన ప్రేమ కాదు. తల్లి అయితే తన పుత్రుడు చెడ్డవాడైనా సరే ప్రేమిస్తూనే ఉంటుంది. **అసలైన అమ్మకు ఎవరిని చూసినా బిడ్డే అనిపిస్తుంది.** అని అమ్మ తన విశ్వజనీన ప్రేమ తత్త్వం గురించి చెప్పారు. **బిడ్డ తల్లిని నిరాకరించినా, తల్లి బిడ్డను నిరాకరించదు** అని ప్రేమ తత్త్వం గురించి వివరించారు అమ్మ. అందుకే ప్రేమ తత్త్వాన్ని నేర్పాలంటే కల్తీలేని ప్రేమకు గుర్తుగా తల్లి అవతారమే మంచిదని, అమ్మ మాతృశ్రీ అవతారిణిగా వ్యక్తమైంది. అమ్మ అనేక సందర్భాలలో మాతృతత్త్వాన్ని తెలియజేశారు. **అమ్మఅంటే సంపూర్ణ అవతారం కాదు, సంపూర్ణత్త్వం** అని మాతృప్రేమలో సంపూర్ణతను ఆచరించి, చాటి చెప్పారు. పిల్లి అన్నాన్ని ముట్టుకుందంటే పిల్లి కాదు పిల్ల అని సరిచేశారు అమ్మ. నక్సలైట్లు దోచుకెళ్తే, **నక్సలైట్లూ నా బిడ్డలే. కొందరు అడిగి తీసుకుంటారు, కొందరు అదరగండంగా తీసుకుంటారు. తల్లికి తప్పే కనిపించదు. నేను మీ గుణాలు చూచి ప్రేమించడం లేదు నా కోసం నేను ప్రేమిస్తున్నాను** అని, తన అవతార లక్ష్యాన్ని గుర్తుచేశేవారు అమ్మ. అందుకే అమ్మ ప్రేమరూపిణి.

మన అమ్మ చెప్పే సందేశం ఏమిటంటే **తన బిడ్డలో ఏమిచూస్తున్నామో అందరిలోనూ దాన్ని చూడటమే బ్రహ్మస్థితిని పొందటం** అని. అమ్మ అలా సహజంగా చూశారు కనుక అమ్మకూడా బ్రహ్మమే! అమ్మ జగత్తూ జగజ్జననీ కూడా. కనుక మనమందరము అమ్మ బిడ్డలమే మరియు అమ్మ బ్రహ్మగా మనలో వ్యాపించియుంది. అమ్మ సర్వవ్యాపినీ. అందుకే అమ్మ అంటారు, **అందరూ నాఒడిలోనే తిరుగుతున్నారు. ఒడిని విడిచి ఎవరూలేరు** - అని. అమ్మలేని చోటులేదు. కనుక మనమందరము ఎక్కడెక్కడికి తిరిగినా అమ్మలోనే ఉన్నాము.

తల్లి అంటే తొలి అనే అమ్మమాటలో అమ్మయే ఆదిశక్తియని మూలశక్తియని అర్థంచేసుకుంటే, తదుపరి ఉత్పన్నమయిన సకల ప్రాణులూ అమ్మకు బిడ్డలే. **అమ్మ అంటే ఆదీ, అంతము లేనిది.** ఎందుకంటే అమ్మే బ్రహ్మముగనుక. నిరంతరం జరిగే సృష్టి ఆ అమ్మనుండే ఉద్భవిస్తున్నది. గనుక అమ్మ ప్రసవిత్రీ మరియు నిత్య బాలింత. **ఇదంతా దేని నుండి వస్తుంది ? అదే ఇన్ని రూపాలుగా వచ్చింది.** అని అమ్మ అన్నది.కనుక అమ్మ జగన్మాత మరియు అమ్మే జగత్తు. అమ్మప్రేమను చవి చూడాలంటే అమ్మ తినిపించే అన్నం ముఖ్యం. ఎవరికైనా అమ్మచేతి గోరుముద్దలు తింటేగాని అమ్మ ప్రేమంటే ఏమిటో తెలియదు. ఆకలిగొన్న వారికి అన్నంతింటే కలిగే తృప్తికంటే, మణి మాణిక్యాలు, భోగభాగ్యాలూ లభించినా కూడా గొప్పగా ఉండదు. అందుకేనేమో అన్నపూర్ణాలయం ఏర్పడింది. అందరికి అన్న సంతర్పణ జరుగుతున్నది. ఇది అన్నదానం కాదు. ఎవరి అన్నం వారు తిని వెళ్తున్నారు అంటారు అమ్మ. అన్నదానమా? అంటే <u>తల్లి ధర్మం నెరవేరు తున్నది. దానం కాదు</u> అంటారు అమ్మ. అమ్మ మనస్సు ఎలా ఉంటుందో అమ్మ మాటల్లోనే చూడండి. <u>లక్షమంది తిన్నారు అనేదాని కన్నా, ఒక్కరు తినలేదు అనేది బాధగా ఉంటుంది</u> అని అమ్మతత్త్వాన్ని మరోసారి ప్రస్ఫుటంగా తెలియజేశారు అమ్మ. అందరికీ అన్నం పెట్టే అమ్మ అన్నదా. అమ్మ దయామూర్తి. కోరికలు తీర్చే వరదాయిని. సాంద్ర కరుణామయి అనగా అంతకు మించిన కరుణారసం లేదు. అమ్మ అవ్యాజ కరుణామూర్తి. ఇట్టి అమ్మావతారం సాటిలేనిది.అమ్మ సత్యస్థితిని కొంతవరకు అర్థం చేసుకున్నాము. అవతార స్థితిని రెండవ భాగంగా వివరించుకున్నాము. అవతారకార్యక్రమం అమ్మగానే ఎందుకు అనేది కూడా తెలసుకున్నాము. ఇక అమ్మ కార్యక్రమ సరళిని వివరించుకుంటే మూడవభాగం మొదలుకాగలదు.

అమ్మ వాక్యాలు సృష్టి ఆదిని తెలుపుతున్నాయి. మానవుని బాధలకు కారణం తెలిస్తే, నివారణ అనేది మూలంలో జరగాలని అమ్మ

విధానం. జన్మ వల్ల కర్మచేసి బాధపడుతున్నామా ? కర్మ వల్ల జన్మించి బాధపడుతున్నామా ? అసలు జన్మముందా ? కర్మముందా ? అది మనకు మనం చేసుకునే అవకాశం ఎక్కడిది ? **మొదటి జన్మకేది ఆస్కారమో, ఈ సంస్కారాలన్నిటికీ అదే ఆస్కారం** అని జీవుని ఆవిర్భావానికి మూలం చెప్పారు అమ్మ. **జన్మకు కారణం అకారణం** అని జీవుల దృష్టి కోణంలో చెప్పారు అమ్మ. మారని ఆత్మనుండి మార్పుచెందే మనస్సు వచ్చింది. అయినా ఆత్మకు మనస్సుకు భేదం లేదు. **ఆత్మ అన్నా మనస్సు అన్నా ఒకటే** అంటారు అమ్మ. తరువాత **"నేనూ" మనస్సూ ఒకటే** అంటారు అమ్మ. ఇక్కడ నేను అంటే మనలో నున్న ఆత్మ. మరో అర్థంలో నేను అంటే అమ్మ. ఎందుకంటే అన్ని నేనులూ అమ్మే గనుక. మనస్సే భగవంతుడు కనుక. అమ్మంటే దైవమే.

మనయేవ మనుష్యాణ్యాం కారణం బంధమోక్షయో

బంధానికీ మోక్షానికీ కూడా మనస్సే కారణం అని ఉపనిషద్వాక్యం, అంటే భగవంతుడే కారణం. **మన మనస్సు బట్టి ప్రపంచ కనబడుతుంది.** ఆ ప్రపంచం వల్లనే సుఖము దుః ఖము, బాధలు. బాధలనుండి విముక్తి కావాలంటే ఆ బాధలకు కారణమైన మనస్సు పోవాలి. **మనస్సు అస్వతంత్రురాలా ?** అని అడిగితే **స్వతంత్రురాలూనూ** అని చెప్పారు అమ్మ. ఎంత వరకు స్వతంత్రురాలంటే ఒక ఆవును కొంత పొడవున్న త్రాడుతో కట్టేస్తే అది ఆ మేరకు స్వేచ్ఛగా తిరిగి మేత మేస్తుంది. అంతవరకే, త్రాడుకున్న పొడవును మించి పోవడానికి దానికి స్వేచ్ఛలేదు. అట్లే ఆ కొద్దిపాటి స్వేచ్ఛతో తాను కర్తను భోక్తను అనుకోవడం మానవుని అజ్ఞానం.బంధించబడి ఉన్నాను,అందువలన నాకు విముక్తి కావాలి అనుకోవడం ముముక్షత్వం.

మనస్సుకు స్వేచ్ఛలేదనే దానికి అమ్మ చెప్పే వాక్యాలు చూడండి **అనుకున్నది జరుగదు, తనకున్నది తప్పదు. అన్నీవాడే చేయిస్తున్నాడని తెలియక పోవడమే మాయ (భ్రాంతి). భ్రాంతి వదిలితే బ్రహ్మమే. తా నొకటి తలిస్తేదైవమొకటి తలుస్తాడు కాదు, దైవంతలిస్తే నే తాను**

తలుస్తాడు. ఆడేదీ ఆడించేదీ, చూచేదీ "అదే". అన్ని సంకల్పాలూ ఆ సత్తావే. అది ఎట్లా నడిపిస్తే అట్లా నడుస్తున్నాం. చేయాలనుకున్నా చేయలేకపోవటానికీ, మానాలనుకున్నా మానలేకపోవటానికీ కారణం మనచేతల్లోనిది కాదు. కర్మ ఆర్జించినది కాదు. అది కూడా వాడిచ్చినదే. కార్యకారణాలకు మనం కర్తలం కాదు. నువ్వు చేయడంకాదు నాన్నా! వాడుచేయడమే. సర్వమూ వాడి ప్రమేయం వల్ల జరిగినప్పుడు కర్మసిద్ధాంతం ఎక్కడ ? కర్మ మనం చేయడమంటే వాడు చేయడమే అని మన తప్పేం లేనట్లు అమ్మ చెప్పారు. ఎవరో నడిపించడం కాని, ప్రేరణ చెయ్యడంగాని జరుగుతుందంటారు అమ్మ. ఏదో శక్తి మనలనందరినీ బొమ్మల్లాగా ఆడిస్తుందంటారు అమ్మ. కర్తృత్వం ఎవరిది ? శక్తిదే ! ఆ శక్తికర్తృత్వం క్రింద ఆడబడేవాళ్లమే. ఒక విధమైన బొమ్మలమే. ఆ శక్తి అంటే అన్నిటికీ మూలమైనది అంటారు అమ్మ. మనం నడవడానికి అవసరమైన ప్రేరణను ఆ శక్తే ఇస్తుంది.ప్రేరణే దైవం అంటారు అమ్మ. దోమ ఏ సంస్కారం చేస్తేనల్లి అవుతుంది ? పిల్లి ఏసంస్కారం చేస్తే కుక్కఅవుతుంది ?

అని అమ్మ వేసిన ప్రశ్నకు ఆ తల్లి ప్రేరణవల్లనే సృష్టి పరిణామం జరిగి, మానవ జన్మ వచ్చిందని తెలుస్తుంది. మానవులలో కూడా అదే ప్రేరణ జరుగుతుండగా తన వికసించిన బుద్ధితో దైవం నెరవేరుస్తున్న కర్మలకు తానుకర్తను, భోక్తను అనుకుంటున్నాడు మానవుడు. ఇదే అజ్ఞానం.

ఇక మూల కారణం తెలిసింది. మనం ఏమీ చేయలేము. ఏది చెయ్యాలన్నా ప్రేరణతోనే జరగాలి . ఒకరికి భక్తి కలగటం ఆ ఆ ప్రేరణ వల్లనే. మరొకరికి యోగాభ్యాసం చెయ్యాలన్న కోరికపుట్టితే అదీ దైవీ ప్రేరణ వల్లనే. సాధన చెయ్యాలనిపించడం వారికి అందే ప్రేరణవల్లనే. చివరికి ఆత్మానుభవం రావాలన్నా ఆ ప్రేరణకలిగించే దైవం లేక మాయాశక్తి యొక్క సహాయం కావలసినదే.మనస్సుకు రూపం కనపడదు. ఆలోచనలు ఎక్కడ మండి వస్తున్నాయో తెలియదు. థాట్ వచ్చిందంటారు, ఎక్కడనుండి వచ్చింది వచ్చిన తరువాత తెలుస్తుంది. దానినే ప్రేరణ అంటారు అని

అమ్మవాక్యాలు. ఆలోచన కలిగాక మాత్రమే అది మన ఆలోచనగా గుర్తింపబడుతున్నది. ఆలోచన రాకముందు ఒక ప్రేరణ ఉన్నది. అది మనకు తెలియదు కనుక మనకు సంకల్పం కలిగించే శక్తి ఏదో ముందుగా అది ఆ శక్తి యొక్క సంకల్పం అన్ని సంకాల్పాలూ ఆ సత్తావే. **సర్వ సంకల్పాలూ, సర్వవాక్కులూ. సర్వకర్మలూ దానివే** నంటారు అమ్మ. అందరిలోనూ ఆ సత్తాయే సమష్టిగా ఉండి అందరి వ్యష్టిమనస్సులను ప్రేరేపిస్తున్నది. కనుక వ్యష్టిగా మానవుని తప్పేమీలేదు. **సమష్టి కర్మ తప్ప వ్యష్టికర్మలేదు** అంటారు అమ్మ. సమష్టి మనస్సుగా ఆలోచించేదే వ్యష్టి మనస్సులయొక్క రాగ ద్వేష అసూయలతో కూడిన సంసారాలు. **ఇది విశ్వకుటుంబం, అనేకరకాల మనస్తత్వాలు ఉంటాయంటారు** అమ్మ.

అయితే మానవుడు సాధనచేసి కర్మ వాసనలను క్షయం చేసుకోవాల్సిన అవసరం లేదా ? నిజమే అతడికి సాధన చేయాలని ప్రేరణ కలిగితేనే సాధన మొదలు పెడతాడు. మనస్సును నిగ్రహించి పాతకర్మల ననుభవిస్తూనే కొత్త కర్మ అంటకుండా ఉండేటట్లు సాధన చేస్తాడు. కాని మనస్సును అరికట్ట గలడా? **మనస్సును అరికట్టే స్థితి ఇచ్చినవాడికి గాని, పుచ్చుకున్న వాడికిలేదు** అంటారు అమ్మ . చివరికి అమ్మయే ప్రేరణ అని ప్రకటించేస్తారు. ఎలాగంటే **మానవ ప్రయత్నం అంటూలేదు. ప్రయత్నం వెనుక ప్రేరణ ఉన్నది.ఆ ప్రేరణ నేనే** మరియు **నేనూ మనస్సూ ఒకటే** అని తేల్చి పారేస్తారు అమ్మ. మరోసారి అమ్మఅంటారు, **ఏది తోస్తే అది చేయ్యి , తోచేటట్లు చేసేవాడు వాడేగా** అని.ఆలోచనలను ప్రేరేపించే అమ్మ మానవులలో పరావాక్కుగా ఉన్నది. ఆలోచన కనిపించడం పశ్యంతి. ఆలోచనలతో స్వభావము, గుణములు మిళితం కావడం మధ్యమా. ఒక పద్ధతిలో తలపులోగాని మాటలోగాని కాయ కర్మలోగాని వివరంగా తెలియబడటం వైఖరీ. అమ్మయే పరా, పశ్యంతి మధ్యమా, వైఖరీ. అన్ని దశలలోనూ ప్రేరణగా ఉన్నది అమ్మయే. ప్రేరణ మనకు యింకా అందకముందు అమ్మతత్త్వం "పరా ". ఇప్పుడు మనకు తెలిసిందేమంటే

మనకు జన్మ, కర్మ, ప్రేరణ అన్నీ ఇచ్చింది ఆదిపరాశక్తి అయినట్టి అమ్మయేనని. ఇప్పుడు అమ్మ అవతరించింది ఎందుకంటే భక్తి, యోగము, తత్వ విచారణా సాధనలయందు ఆసక్తి కలిగించే విధంగా మనకు ప్రేరణ కలిగించి, మనలో రాగ, ద్వేష, అసూయలను పారద్రోలే పనిచేయడానికి. చివరికి అందరికీ సుగతి నందించడానికి. అందుకే యీ అనసూయతత్త్వం. **రాగద్వేషాలనే రెండు గ్రహాల మీద ఆధారపడి ఉన్నది మానవుని నడక. ఆరెంటికి ఆధారం "నేనే"** అన్నారు అమ్మ. కనుక అమ్మ యొక్క ఈ అవతారం అనసూయ తత్త్వం. **రాగద్వేష అసూయలను పారద్రోలేదే అనసూయ తత్త్వం** అని అమ్మ అంటారు. **నీ తెలియని తనానికి కారణం నేను. నీ చేత తెలియ పరచుకోవలసిందీ నేను** అని **మీకీ బాధలు ఎవరిచ్చారో వాళ్ళే ఆ విముక్తి కల్పిస్తారు** అని అమ్మ మనకు అభయహస్తం చూపించారు. మన కందరికీ సుగతిని ప్రసాదించడానికే అమ్మ అవతరించారు. అమ్మ మన రాగద్వేషాలతో కూడిన బంధంనుండి విముక్తి కల్పించడానికి వచ్చారు. అందుకే ఆమె రాగ స్వరూప పాశాఢ్యా. జనన మరణ చక్రం అనే భవరోగాన్ని నివారించడానికే అమ్మ వచ్చారు. అందుకే అమ్మ భవరోగఘ్ని. అజ్ఞానమును పోగొడతారు గనుక ఆమె తమోపహా. అమ్మ మన యొక్క పాపాలను పోగొడతారు గనుక ఆమె మహాపాతక నాశనీ. జన్మాంతర సంస్కారాలను తుడిచి పెట్టి, బంధపాశములను త్రెంచుతుంది గనుక అమ్మ పాశహంత్రీ.

అమ్మ మనకోసం ఏ లక్ష్యం నెరవేర్చాలని అవతరించారో ఇప్పుడు మనకు తెలిసింది. అమ్మ మనలను ఉద్ధరించడానికి ఎంచుకున్న మార్గం విలక్షణము. ఎందుకంటే పూర్వ అవతారలైన కాళీ, దుర్గగా వచ్చినప్పుడు దుష్టశిక్షణే అవతార లక్ష్యం. ఇప్పుడు అమ్మ అభిప్రాయం ఏమంటే **దుష్టశిక్షణ అంటే మనుష్యులను చంపడం కాదు, మనస్సును మార్చడమే. ఆనాటి విధానం తప్పుకాదు, ఆనాటి వ్యవస్థ అలాంటిది** అంటారు అమ్మ. ఇప్పుడు మంచి చెడు సమానంగా ఉన్న మనుష్యులలో వారి మనస్సులను ఆధ్యాత్మికముగా మారేటట్లుగా ప్రేరణ నివ్వడమే అమ్మ ప్రణాళిక. ప్రేమ

తత్వాన్ని ఆయుధంగా చేసుకొని తన భక్తులు, విమర్శకులు, నాస్తికులు అనే బేధం లేకుండా అందరికీ సుగతిని అందించడమే అమ్మ అవతార లక్ష్యం. నాల్గవ భాగంగా అమ్మ అవతార కార్యక్రమం ఏ విధంగా జరపడం ద్వారా జనావళికి సుగతిని కల్గిస్తారు అనేది. బాధలు లేకపోతే మానవ జన్మకు మోక్షం లేక సుగతి అవసరం
ఉండదు. బాధలుండబట్టే దైవానుగ్రహం కోరుతున్నారు. బాధలు తీర్చుకోవడం వారి వల్ల కానప్పుడే దైవభక్తి లేక సుగతి కోసం సాధన మొదలు పెడుతున్నారు మానవులు.

బాధకు నొప్పికి తేడాఏమిటి ? **మనస్సుకు తగిలితే బాధ, శరీరానికి తగిలితే నొప్పి** అని అమ్మ యిచ్చిన నిర్వచనం. శరీరానికి తగిలిన నొప్పి మనస్సుకు ఓర్చుకొనే బాధకావచ్చును. ఆ బాధ తప్పకపోవచ్చును. శరీరానికి ఏ నొప్పీ లేనప్పుడు మనస్సుకు కలిగే బాధ మనం ఎవరికి వారు భావనచేసేదే ఒకరికి బాధైన విషయం మరొకరికి కాకపోవచ్చును. **మనస్సుకు బాధ ఉంది అనుకుంటే**
ఉంది, లేదు అనుకొంటే లేదు. సుఖంగా బాధననుభవిస్తున్నా బాధ, బాధ కాదు గదా ! అని అమ్మ వ్యాఖ్యానిస్తారు. పైగా బాధలుంటేనే తెలివి పెంచుకుంటాం మరియు చైతన్యం పనిచేస్తుంది. **బాధలు లేని బ్రతుకు కంటే చావు నయం** అని అమ్మ బాధలయొక్క ఆవశ్యకతను నొక్కి చెపుతున్నారు. ఎందుకంటే బాధంటే **చైతన్యమే. అది లేకపోతే ఏమిలేదు. బాధలుండవలసిందే లేకపోతే స్థాణువైపోతాడు** అని అమ్మ సిద్ధాంతం.

అమ్మ కార్యక్రమానికి, ఈ బాధాలకూ ఏమిటి సంబధం అను కొంటున్నారా ? ఇక్కడ ఒక రహస్యం దాగి ఉంది. బాధలవల్ల మానవ చైతన్యం వికసిస్తుంది. బాధలను యిష్టంగా సహిస్తే మనస్సును జయించి చైతన్యాత్మగా అనుభవం వస్తుంది. దీనిని మరింత వివరిస్తే బాగా అర్థమవుతుంది.

ఆత్మ చేతనే మనస్సు ఏర్పడ్డది. మనస్సు అంటేనే కదలిక (చలనం) అది లేకపోతే, అంటే చలనం లేకపోతే మనస్సు అనే మాట

వర్తించదు అంటారు అమ్మ.ఆత్మ చలించదు కనుక మనస్సు యొక్క చలనాలను ఆపివేసిననప్పుడు నిశ్చలమనస్సే ఆత్మగా అనుభవింపబడుతుంది. మనస్సు యొక్క చలనాలను ఆపడానికి బాధలే పరీక్ష. బాధలు లేకపోతే ఉన్నచోటే ఉంటాము. ఆధ్యాత్మిక ప్రయాణం ఉండదు. అనగా చైతన్య వికాసం ఉండదు. ఆ బాధలను యిష్టంగా తీసుకుని సహజ సహనం సంపాదిస్తే మనస్సు చలించడం ఆగి నిశ్చలమవుతుంది. **బాధలు అనుభవిస్తున్నా అది బాధ అనిపించనప్పుడు సహజ సహనమవుతుంది** అంటారు అమ్మ. కనుక బాధలుండటం, వాటిని ఓర్పుకోవడం, పిమ్మట బాధలను సహించుకోవటం, అంటే సహజంగా స్వీకరిస్తూ, మనస్సును చలించకుండా ఉంచుకోగలిగితే మనం మన మనస్సును దాటి మనలోనే మిగిలి ఉన్న శాశ్వతమైన చైతన్యాన్ని అనుభవించగలుగుతాము. అందుకే **సహజ సహనమే సమాధి** అని మోక్షం గురించి అమ్మ వ్యాఖ్యానిస్తారు. **సర్వకాల సర్వావస్థలయందు సహజ సహనమే సమాధి.** అదే ముక్తి కనుక బాధలెవరికి ఎక్కువగా ఉంటే వారు త్వరితంగా ముక్తులవుతారు.ఇది అమ్మ వ్యాఖ్యానం. అందువలన బాధలుండటం అమ్మదయ.

ఎల్లకాలం బాధలుండవు, కాని బాధలను సాధనగా, అమ్మదయగా స్వీకరిస్తే మరియు ఇష్టంగా అనుభవిస్తే చివరికి ముక్తి కలుగుతుంది. **శిల్పానికి అందం రావలంటే ఉలిదెబ్బలు తప్పవు** అని అమ్మ, బాధలున్నవారిని అదృష్టవంతులు అంటారు. **అలలు లేనిది సముద్రమూ కాదు, బాధలు లేనిది జీవితమూ కాదు,** అని బాధలయొక్క అనివార్యస్థితిని తెలుపుతారు అమ్మ. **జీవితమంటే సమస్యల తోరణం** సాధకులకైతే అది **సమస్యలతో రణం** అని బాధలను సుగతికి మార్గం అన్నట్లు చెపుతారు అమ్మ.

చివరిలో అమ్మయిచ్చే అభయహస్తం ఏమంటే **నీకీ బాధలు ఎవరిచ్చారో, వాళ్ళే ఆ విముక్తి కలిగిస్తారు** అని అమ్మ అన్నింటికీ తానే

బాధ్యత వహిస్తూ ,తానే విముక్తిని కల్పించడానికి అవతరించానని భరోసా ఇస్తున్నారు.

అమ్మ విముక్తి ఎలా కల్పిస్తారు. ? ఎప్పటికో అప్పటికి అందరికీ విముక్తే కాని ఆ సుగతిని వేగిరంచేయడానికి అమ్మ యొక్క అవతారం వచ్చింది. అందుకు అమ్మ యిచ్చిన ప్రతిజ్ఞ మనకు ఆనందదాయకం. ఇది అమ్మచేసే ప్రత్యక్షచర్య కాదు. ఆమె అందరికీ తగిన విధంగా ప్రేరణ ఇస్తూ అందరినీ పురోగమింపచేస్తారు. ఆ ప్రేరణ పరావాక్కు స్థాయిలో ఉండి చేస్తారు. అందుకోసం అమ్మను ప్రార్థించాలి మనం. గురువుకు శిష్యులను సంపాదించి బోధించాలని ప్రేరణ, శిష్యులకు గురువును అన్వేషించి వెంబడించాలని ప్రేరణ. అందుకోసం అమ్మ ప్రేరణ కోసం అమ్మ రక్షణ కోసం, అమ్మ శక్తికోసం, గురు శిష్యులిద్దరూ ప్రార్థించాలి, అమ్మ ప్రత్యక్షంగా గురువు కాదని యిలా చెప్తారు. **నేను గురువునుకాదు, మీరు శిష్యులు కాదు. నేను అమ్మను మీరు నాశిశువులు** అని అంటారు అమ్మ.

సహనావవతు, సహనౌభునక్తు సహవీర్యం కరవావహై
తేజస్వినా వధీతమస్తు మా విద్విషావహై
ఓం శాంతి : శాంతి : శాంతి :

అన్న శాంతి మంత్రంలో గురు శిష్యులిద్దరూ కూడా వేదమాతనే వేడుతున్నారు. అనగా అమ్మ అనుగ్రహం, లేక ప్రేరణను కోరుతున్నారు. ఏమనీ ? ఇద్దరినీ రక్షించాలి. ఇద్దరికీ అనుభవం రావాలి.ఇద్దరికీ శక్తి, ప్రజ్ఞలుండాలి. గురుబోధ, శిష్యనిసాధన అయ్యేవరకు ఒకరి మీద మరొకరికి ద్వేషం కలుగకుండా ఉండాలి. అందుకు అడ్డు వచ్చే ఆధ్యాత్మిక, ఆధి భౌతిక, ఆధి దైవిక తాపాలు శాంతించాలి. అంతేగాని గురుశిష్యులిద్దరూ ఇట్టి బోధలోగాని సాధనలో గాని కర్తలుకాదు మరియు స్వతంత్రులు కాదు. గురు శిష్యులిద్దరిలోనూ అమ్మే ప్రేరణగా నున్నారు. గురువులో జ్ఞాన స్వరూపంగాను, శిష్యునిలో అజ్ఞానంగాను అమ్మే ఉన్నారు. అందువలన అమ్మ విద్యావిద్యా స్వరూపిణి.

విడిగా స్వతంత్రంగా ఎవరూ ఏ సాధన చేయలేరు. ఎందుకంటే అమ్మ అంటారు ప్రతి వాళ్ళూ సాధన అవసరం అని చెప్తారు. వారు చేప్పే దాంట్లో కర్త, చేయించేదీ అర్థం కావడంలేదు. కర్మ మాత్రం అర్థం అవుతున్నది. అందరికీ తెలియడమే తోస్తున్నది, గాని అలా తెలయబడడానికి కారణమెవరన్నదీ తెలియడంలేదు. ఈశ్వరుడూ కాదు. జీవుడూ కాదు. చేద్దామనుకున్నది ప్రేరణ, చేసింది క్రియ. క్రియ మనదిగా కనిపిస్తుంది. కర్త ఎవరో తెలియదు. ప్రేరణ ఎక్కడిదో అయినప్పుడు వీళ్ళు సాధనచేయడం ఏమిటి ? అని మనలోని సాధకుడికున్న కర్తృత్వం ఎగర గొడుతున్నారు అమ్మ. ఇవి సాధకుని విషయంలోగాని, ఇతర కర్మలు జరిగేటప్పుడు గాని అమ్మ చెప్పేనిజాలు. **సాధన అంటే చెయ్యడంకాదు. తోచిందేదో చెయ్యి.కాని తోపింపచేసేవాడు వాడే నసే భావనతో చెయ్యి** అంటారు అమ్మ. అప్పుడు నీవు చేసే సాధనకు నీవు కర్తవు కాదు. **సాధన అనేది నీకు తెలియకుండానే జరుగుతుంది. ఏమీ చెయ్యకుండా కూర్చుంటే అదీ సాధనే** అంటారు అమ్మ. అప్పుడది అమ్మ చూపే కృపగాని అన్యముకాదు. బాహ్యంగా చూస్తే అమ్మ అవతారిణి. కాని తత్త్వంగా చూస్తే అమ్మ సద్గురువు కూడా. **సద్గురువు అంటే తనంతట తాను వచ్చి దగ్గరకు తీసుకొనేవాడు** అని అంటారు అమ్మ. అమ్మ మనలను లాలనగా దగ్గరకు తీసుకుంటున్నారు. కనుక అమ్మ తత్త్వం సద్గురు తత్త్వమే.

సహించడంలోనే సాధన ఉంది అన్నారు అమ్మ. సహించడంవేరు, ఓర్చు కోవడంవేరు. ఓర్చు కోవడమంటే బాధను గుర్తించి, మనస్సు చలించగా ఆ మనస్సును నిశ్చలం చేయడానికి నిగ్రహించడం. సహనము అంటే సహింపచేసుకోవడం. నాకు ఒక పండు సహిస్తుంది అంటే అది ఆ పండు యెడల ఉన్న ఇష్టం. ఇక్కడ బాధలను సహించడమంటే, బాధలను ఓర్చుకోవడంకాదు, నిగ్రహించడమూకాదు, ఇష్టంగా స్వీకరించడం. ఇట్టి ఇష్టం కూడా నటించడం కాక, సహజమైతే మనస్సు చలించనే చలించదు. అది ఇష్టాయిష్టాలనే ద్వంద్వాలను విడుస్తుంది.

అందువలన రాగద్వేషాలనే ద్వంద్వాలు కలుగవు. కనుక మనస్సు ఎటు వైపుకూ మొగ్గక నిశ్చలంగా ఉంటుంది. దీనినే మనస్సునకు సంబంధించిన సమాధి అంటారు. సహజ సహనమే సమాధి అని అమ్మ ఇట్టి సమాధిని గురించే చెప్పేవారు. ఇట్టి సహజ సమాధిని అభ్యాసం చేస్తూ, సమాధి స్థితిని పొందడం జరగాలంటే బాధలు అనే పరీక్షలుండాలి. అట్టి బాధలనుండి విముక్తి కల్పించినప్పుడే మనకు మోక్షం విలువ తెలుస్తుంది. ఈ విధమైన క్రియలు మనయందు జరుగునట్లు చేసి మనలను ఉద్ధరించడం కోసమే అమ్మ అవతరించారు.

అమ్మ అన్ని మనస్సులూ తానై మనోమయిగానూ, అన్ని రూపాలూ తానై వివిధాకా అయ్యింది. ఎన్ని లీలలు జరిపినా తను మాత్రం శుద్ధమానగా నున్న అమ్మ మన మనస్సులను భేదిస్తూ మనోరూపేక్షుకోదండా అని పిలువ బడుతున్నది. అందుకు అమ్మ కైవల్య పదదాయి, సద్గతి ప్రదా, సుఖప్రదా,సుఖకరీ, శుభకరీ, శాంకరీ అనగా సకల సుఖాలను కలుగచేసేది. అమ్మ శ్రీకరీ అనగా శోభను చేకూర్చేది. అమ్మ అనుగ్రహదా, కరుణారససాగరా మరియు శివజ్ఞానప్రదాయినీ. మనలో రాగాన్ని తొలగించుతూ నీరాగా అయ్యింది.రాగాన్ని అణగద్రొక్కుతూ రాగమథనీ అయ్యింది. అహంకారాన్ని నశింపచేస్తూ మదనాశనీ అయ్యింది. మనలో నున్న మోహాన్ని నశింపచేస్తూ మోహనాశనీ అయ్యింది. మమతలను చంపేస్తూ మమతాహంత్రీగా, పాపాన్ని నిర్మూలిస్తూ పాపనాశనీగా, క్రోధాన్ని పారద్రోలుతూ క్రోధశమనీగా, లోభాన్ని పోగొట్టి లోభనాశనీగా, జనన మరణ చక్రాన్ని ఉపసంహరించడం ద్వారా భవనాశనీగా కీర్తించబడుతున్నది అమ్మ.

అరిషడ్వర్గము, రాగద్వేషాలు, అహంకారము ఉన్నప్పుడు మనకు భేదభావమే ఉన్నది. ఇవన్నీ తొలగించడం వలన అమ్మ భేదనాశనీ అయ్యింది. మృత్యువును దాటించడం వలన మృత్యుమథనీ అయ్యింది అమ్మ. మోక్షసుఖం రాగానే దుఃఖ నాశనం జరిగింది. కనుక అమ్మ దుఃఖహంత్రీ అయ్యింది. మరిన్ని నామాలు పశుపాశవిమోచనీ. నిర్వాణ

సుఖదాయనీ.యోగదా, జ్ఞానదా, ముక్తిదా, సంశయఘ్ని, స్వర్గాపవర్గదా అనేవి అమ్మకు చక్కగా సరిపోతాయి అమ్మ యొక్క విశేష నామాలన్నీ సమన్వయం కావడమంటే ఒక సమగ్రమైన సంయక్ నామము " లలితాంబికా " అని అంటే ఇంకేమీ చెప్పనవసరంలేదు.

ఈ విధంగా ఎవరైతే అమ్మ తత్త్వాన్ని నిజంగా తెలుసుకుంటారో వారికి అజ్ఞానంతొలగి జ్ఞానోదయం అవుతుంది. **నన్ను గుర్తించడమే జ్ఞానోదయం_** అనే అమ్మ వాక్యంతో అమ్మ తత్త్వ విచారణను ముగించేయవచ్చును. అట్టి జ్ఞానోదయం సద్గతిని కలుగచేస్తుంది. ఇది అందరికీ వర్తింపచేయ సంకల్పించారు అమ్మ. అమ్మను పరబ్రహ్మ తత్త్వంగా గుర్తిస్తే, బ్రహ్మను తెలుసుకున్న వారుబ్రహ్మమే అగుదురు. అదే సద్గతి. అమ్మను మాయాశక్తిగా తెలుసుకున్న వారికి మాయ మర్మం తెలిసి భ్రాంతినుండి విడుదలవుతారు. అమ్మను ఏ విధంగా గుర్తించినా సద్గతే.

మాయ తనువై మాయ తానై మాయపనులను చేయుచును మరి మాయ తవ మర్మంబు గనకే మాయమై పోవున్ ॥ జీవా మేలుకొనవే.॥

మన శరీరాలు మాయ, మన పనులు మాయ, అన్నీ మాయాశక్తి ప్రేరణ వల్లేనని, ఆ మాయ వల్ల కలిగే ఇంద్రజాల మర్మము, ఎవరికి తెలుస్తుందో మరియు ఎవరికైతే ఆ మాయ వల్ల తోచినవేవీ సత్యము కాదనే జ్ఞానోదమవౌతుందో, ఇక వారికి మాయ ఉండదు. అనగా భ్రాంతి ఉండదు. **భ్రాంతి వదిలితే బ్రహ్మమే** అంటారు అమ్మ.

మాయ మాయమైతే మిగిలేది పరిపూర్ణమే, అనగా **ఉన్నది ఉన్నట్లుగా గుర్తించిన వాడు జ్ఞాని. ఏ సత్యమైతే ఉన్నదో ఆ సత్యం తెలిసిన వాడికి జన్మలు లేవు** అని అమ్మ అంటారు. మాయ తెర తొలగినప్పుడు సత్యం ఒకటైనప్పుడు, **ఆ సత్యం తానైనప్పుడు, అన్నీ పరిపోతాయి.** అనగా **జ్ఞానమంటే అంతా తాను అనుకోవటం** అన్నారు అమ్మ. ఎవరికైతే అమ్మతత్త్వం ఈ విధంగా అన్ని కోణాలలో

ఒక్కటైన సమాధానంగా అవగాహన అవుతుందో వారికి లభించేది సద్గతి.

అమ్మ అవతార లక్ష్యమైన **అందరికీ సద్గతి** అనే అమ్మ వాక్యంతో ఈ అమ్మ తత్త్వ విచారణను ముగిస్తున్నాను.కాని అన్నీ అమ్మే చేస్తే మనం చేయాల్సింది ఏమీ లేదా ? చేయవలసినది మనమే గానీ, అమ్మ ప్రేరణ లేనిదే ఏమీ చేయలేము. అందుకే బోధగా కాకుండా సూచనగా చెప్పారు అమ్మ మనం చేయవలసిన పద్ధతులను ఈ క్రింది విధంగా.

1. నాజీవితంలో (అమ్మజీవితంలో) మీకేదైనా మంచిదనీ. నలుగురూ అనుసరించ తగినది ఉన్నదనీ అనిపిస్తే దానిని సందేశంగా తీసుకోండి.
2. తన కోసం చేసేది రాగం, ఇతరులకోసం చేసేది త్యాగం
3. గుణానికి మన కంటే మించిన వారిని, ధనానికి మనకంటే తక్కువ వారిని పోల్చుకోవాలి.
4. నేను ఈ విధంగా ఎందుకు పెడ్తున్నానంటే (అన్నసంతర్పణ) మీరూ ఈ విధంగా ఇంకొకరికి పెట్టడానికి.
5. ఇతరులను విమర్శించడం అవివేకం, తనను తాను విమర్శించుకోవడం వివేకం.
6. సర్వత్రా మంచిని చూడటమే మంచితనం, ఎదుటి వారిలో దైవత్వాన్ని చూస్తున్నంతసేపూ మనలో దైవత్వం కలుగుతుంది.
7. లేని దాని కొరకు ఆశించేది దుఃఖం, ఉన్నదానితో తృప్తిచెందేది సంతోషం.
8. గురువే అక్కరలేదంటాను, కాని ఎవరు లక్ష్యసిద్ధికలిగిస్తే వారే గురువు, పరిస్థితులే గురువు, బంధువులు.
9. నీకు తోచేది నేను చెప్పానవి చెయ్యి, ఎవరు ఏది చేయగలిగితే వారికది గొప్పది.
10. సహించడం లోనే సాధన ఉన్నది, ఏమీ చెయ్యకుండా ఉండాలని కూర్చుంటే అదీ సాధనే.
11. ఎవరైనా బోధించే దానికన్నా, పరిస్థితులే ఎక్కువ బోధిస్తాయి.

12. మౌనం అంటే మాట్లాడకపోవడంకాదు, అనవసరంగా మాట్లాడక పోవడం.
13. సర్వాన్నీ పూజ్యభావంతో చూచేవారు పూజ్యులు.
14. ప్రజాసేవ చేయడమూ మోక్షమార్గమే
15. ప్రతి స్త్రీలోనూ " అమ్మ " ను (దైవాన్ని) చూచేవాడికి అందని దంటూ లేదు.
16. సుఖానికి ఒకటే మార్గము. ఏది చేసినా దైవం చేశాడనుకోవడమే, ఏ ఆలోచన వచ్చినా భగవత్స్వరూపమే ననుకో, అప్పుడేదీ నీ జోలికిరాదు.

ఈ సూచనలేకాదు. అమ్మ అనేక సందేశాలు కూడా ఇచ్చారు. ముఖ్యమైనవి కొన్ని మాత్రమే పేర్కొన్నాము. అమ్మ అంటారు, నేను నేనుగా చెప్పను. మీచేత చెప్పిస్తాను, మీచేత చెప్పిస్తే మీ కర్థమవుతుంది, అదే టీచింగ్ అని. అమ్మ బోధచేయడం లేదంటూనే బోధించారుచాలా. ఏది వచ్చినా అమ్మదయ అని అన్నిబాధలూ సహజ సహనంగా ఎవరు భరిస్తారో వారు అమ్మ కృపకు పాత్రులై సద్గతి పొందుతారు. ఇదీ అమ్మ మనకిచ్చిన హామీ.

జయహో మాతా ॥



ఈ గ్రంథము ....

ప్రేమకు ప్రతిరూపంగా అవతరించి, అందరినీ తన బిడ్డలుగా ప్రేమించి, ఆ ప్రేమతత్త్వాన్నే తన సందేశంగా అందించిన వాత్సల్యామృత వర్షిణి జిల్లెళ్ళమూడి అమ్మ. సేవ, ఆధ్యాత్మికత రెండు కళ్ళుగా, అవ్యాజ ప్రేమ హృదయంగా మానవుడు ఎదగాలని, మమతల పరిధిని దాటి అవధిలేని అనురాగ జలధిగా రూపొందాలని తన జీవితాన్నే సందేశంగా ప్రసాదించిన ప్రేమమూర్తి అమ్మ. ఆ తత్త్వజలధి లోతుల్లోని అనర్ఘ రత్నాలను వెలికితీసి అందరికీ పంచడానికి, అమ్మ ఇచ్చిన ప్రేరణతో శ్రీవిశ్వజననీ పరిషత్ 2011 నవంబరు 18, 19, 20 తేదీలలో జిల్లెళ్ళమూడిలో "అమ్మతత్త్వ చింతన మహాసదస్సు"ను నిర్వహించింది. ఎందరో పీఠాధిపతులు, సుప్రసిద్ధ సాహితీవేత్తలు, ఆధ్యాత్మిక తత్త్వవేత్తలు, సద్గురువులు, ప్రముఖ పత్రికా సంపాదకులు, సమాజంలో వివిధ రంగాలలో ఆరితేరిన అతిరథ మహారథులు ఈ సదస్సులోపాల్గొని, అమ్మ సందేశసారాన్ని భిన్న విభిన్న కోణాలలో ఆవిష్కరించారు.

ఆ సదస్సులో చల్లపల్లి నుండి 'విజ్ఞాన స్వరూప్' శ్రీ కోసూరు మురళీకృష్ణారావుగారు వచ్చి ఒక పత్రాన్ని సమర్పించారు. వారి మేథాసంపత్తికి, విజ్ఞాన విలసనానికి, సునిశిత పరిశీలనా దృష్టికి, సమన్వయ సాధనకు ఇది నిదర్శనంగా నిలుస్తుంది. వారి శిష్యురాలు, అమ్మ అనుంగుబిడ్డ శ్రీమతి అన్నె రమణవర్ధని ఈ వ్యాసాన్ని చిన్న గ్రంథరూపంగా తెచ్చి అందరికీ పంచితే బాగుంటుందన్నయ్యా అన్నది. ఆ ఆలోచనకు రూపం ఇవ్వటమే మేం చేసిన పని. అమ్మ బిడ్డలందరూ చదువవలసిన గ్రంథం ఇది. స్వీకరించండి.

– శ్రీవిశ్వజననీ పరిషత్, జిల్లెళ్ళమూడి.